# వరంగల్ వాయిస్
Evening Daily


సంపుటి : 04 | సంచిక : 254
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
జూలై 10, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




7లో..

## పోరాట యోధుడు ఇనుగాల శ్రీధర్

- కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం
- చిరస్మరణీయ విజయాలకు కేరాఫ్ అడ్రస్
- కార్మికోద్యమంలో చెరగని ముద్ర
- తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర





వివరాలు 2లో..

# శక్తి స్వరూపిణీ.. శాకంబరీ

## కన్నుల పండువగా భద్రకాళి అమ్మవారి దర్శనం

- పది టన్నుల కూరగాయలు, ఆకు కూరలతో అలంకరణ
- పులకించిన భక్తజనం
- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి సురేఖ
- పూర్ణకుంభ స్వాగతం పలికిన అధికారులు
- 300మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు

సాక్షాత్తు శక్తి స్వరూపిణి అయిన భద్రకాళి అమ్మవారి ఆషాడ మాస శాకంబరీ ఉత్సవాలను గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు జరిగే శాకంబరీ ఉత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. పదిహేను రోజులపాటు ఉదయం, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులను వివిధ రూపాలలో అలంకరించి పూజలు చేశారు. చివరి రోజైన ఆషాఢ శుద్ధపౌర్ణమి అయిన గురుపౌర్ణమి పర్వదినాన అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో శాకంబరీగా అలంకరించారు. భద్రకాళి ఆలయానికి ఉదయం 10 గంటలకు చేరుకున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సురేఖ జ్యోతి ప్రజ్వలన చేయడంతో భక్తుల దర్శనాలకు అనుమతించారు. వివిధ రకాల కూరగాయలతో అలంకరించిన అమ్మవారిని చూసిన భక్తులు పులకించిపోయారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచే క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఓరుగల్లు ప్రజలతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు భద్రకాళీ అమ్మవారిని శాకంబరీగా చూసి తరించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. 300మందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి



8లో..

## బాబా గుడిలో భక్తజనం

- గురు పౌర్ణమి సందర్భంగా పోటెత్తిన భక్తులు
- శేజ హారతితో ముగిసిన పూజా కార్యక్రమాలు

## ఐక్యతతో అభివృద్ధి సాధించాలి

- పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య
- ఆరె కటిక గురువు శ్రీ ధర్మ వ్యాదుడి విగ్రహావిష్కరణ



8లో..



8లో..

## మున్నూరుకాపు సంఘం బలోపేతానికి కృషి

- వరంగల్ జిల్లా అధ్యక్షుడు ముష్కమల్ల సుధాకర్

# శక్తి స్వరూపిణీ.. శాకంబరీ



- కన్నుల పండువగా భద్రకాళి అమ్మవారి దర్శనం
- పది టన్నుల కూరగాయలు, ఆకు కూరలతో అలంకరణ
- పులకించిన భక్తజనం
- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి సురేఖ
- పూర్ణకుంభ స్వాగతం పలికిన అధికారులు
- 300 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** నగరంలోని సుప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో గత పదిహేను రోజులుగా జరుగుతున్న రాకాంత దీక్ష పూర్వక శాకంబరీ నవరాత్రులు గురువారంతో ముగిశాయి. చివరి రోజు ఆషాడ శుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారిని శాకంబరీగా అలంకరించి పూజారాధనలు జరిపారు. ఉదయం 10 గంటలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయానికి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం అమ్మవారి దర్శనానికి అనుమతించారు. దీంతో కట్టలు తెంచుకున్న ఆనందంతో గుడిలోకి ప్రవేశించి శాకంబరీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని పులకించిపోయారు. క్యూలైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. వేలాదిమంది భక్తులు శాకంబరీగా ఉన్న అమ్మవారిని దర్శించుకుని తరించిపోయారు. దేవస్థానం ప్రాంగణం అంతా భద్రకాళి శరణం మమ, శాకంబరీ శరణం మమ అనే నామ స్మరణతో మారుమ్రోగింది.

### మంత్రికి పూర్ణకుంభ స్వాగతం..

ఆలయానికి విచ్చేసిన మంత్రి కొండా సురేఖకు ఆలయ చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు భ్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, వెలడుగు అంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ రావు, ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

### 10 టన్నుల కూరగాయలు..

సుమారు 10 వేల కిలోల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను సేకరించి దండలుగా చేసి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తెల్లవారి జామున 3 గంటలకు ప్రారంభమైన అమ్మవారి శాకంబరీ అలంకరణ ఉదయం 9.30 గంటల వరకు సాగింది. ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజానంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి అలంకరణకు కావలసిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల బుధవారం సాయంత్రం నుంచే భక్తులు సుచిగా గుడికి చేరుకొని అర్చకుల సూచనల మేరకు దండలుగా తయారు చేసి ఇచ్చారు.

### శాకంబరీ అనగా..

ఈ శాకంబరీ దేవి నీల వర్ణం కలిగి కమలాసనముపై చేతుల్లో వరిమొలకలు, పుష్పములు, ఫలములు, చిగురుటాకులు, దుంపగడ్డలు మొదలగు కూరగాయల సముదాయమును ధరించి ఉండును. ఈ శాక సముదాయములు అంతులేని కోరికలను తీర్చు రసములు గలవై జీవులకు కలుగు అకలి, దప్పిక, మృత్యువు, ముసలితనం మొదలగు వానిని పోగొట్టును. ఉమ, గౌరీ, సతీ, చండీ, కాళికా, పార్వతీ అనే పేర్లతో కూడా ఈ దేవి ప్రసిద్ధి పొందినది. ఈ శాకంబరీ దేవిని భక్తితో ధ్యానం చేయువారు, నమస్కరించువారు, జపించువారు, పూజించువారు తరిగిపోని అన్న, పానామృత ఫలములను అతి శీఘ్రముగా పొందుతారని మూర్తి రహస్యంలో తెలుపబడింది. శాస్త్రాలలో ఈ శాకంబరీ మహాత్యం వివరింపబడి ఉండటం వలన ఈ శాకంబరీ ఆరాధన బహుళ జనాదరణ పొందినది.

శాకంబరీ అంకరణ హనుమకొండ టీచర కాలనీ వాసి ప్రముఖ పవర్ ఇన్స్టాలేషన్స్ కాంట్రాక్టర్ డాక్టర్ మండువ శేషగిరిరావు–రేణుక దంపతులు, హైదరాబాదు వాస్తవ్యులు ఈమని హరికృష్ణ–స్మిత దంపతులు సౌజన్యంతో జరిగింది. పోలీసు శాఖ, ఎన్సీసీ వాలంటర్లు, శ్రీ లక్ష్మీవెంకటేశ్వర, వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు భారీగా తరలి వచ్చిన భక్తులకు క్యూలైన్లలో సేవలందించారు. భద్రకాళి సేవాసమితి కన్వీనర్ అయిత గోపీనాథ్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. అనంతరం శాకంబరీ నవరాత్రుల పూర్ణాహుతి కార్యక్రమాన్ని కన్నుల పండువగా జరిపించారు.













### ఆయురారోగ్యాలతో ఉండాలి..

శాకంబరీ ఉత్సవాల సందర్భంగా నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖ, సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నానని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో మరింత ముందుకు పోవాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కొండా సురేఖ తెలిపారు.



### 300 మందితో బందోబస్తు

శ్రీ భద్రకాళి దేవాలయంలో శాకాంబరీ నవరాత్రి మహోత్సవాల నేపథ్యంలో మట్టెవాడ ఇన్ స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఇందుకు గాను 300 మంది పోలీస్ సిబ్బందిని వినియోగించారు. భక్తులతో ఆలయం కిక్కిరిసి పోవడంతో ట్రాఫిక్ ను ఎక్కడికక్కడ మళ్లిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

# హుందాతనంగా రాజకీయాలు చేయండి

## ● బీఆర్ఎస్ కార్పొరేటర్లకు కాంగ్రెస్ హితవు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హనుమకొండ జిల్లా రాజకీయాలు ఎంతో హుందాతనంతో సాగుతున్నాయని, గతంలో ప్రశ్నించడమే పాపంగా చూసిన తరుణాన్ని బీఆర్ఎస్ కార్పొరేటర్లు గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రాజాలీ, పోతుల శ్రీమాన్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. "హుందా రాజకీయాలు ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు నేర్చుకోవాలన్నారు. మీ హయాంలో కాంగ్రెస్ డివిజన్‌లను చిన్నచూపు చూసిన విషయం వాస్తవం కాదా?" అని కాంగ్రెస్ కార్పొరేటర్లు బీఆర్ఎస్ కార్పొరేటర్లను ప్రశ్నించారు. "చర్చకు మేం అన్ని విధాలుగా సిద్ధం అన్నప్పుడు ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలయాపన వద్దు. మీ పదేళ్లలో దేవాదాయ శాఖకు కేటాయించిన నిధులు ఎంత?" అని నిలదీశారు. వెనక్కి పోయిన స్మార్ట్ సిటీ నిధులను ముఖ్యమంత్రిని ఒప్పించి వెనక్కి తెచ్చిన నాయకుడు నాయిని రాజేందర్ రెడ్డి అని కొనియాడారు. భద్రకాళి బండ్, చెరువు అభివృద్ధి ప్రక్రియ ఈ టెండర్‌లో భాగంగా జరిగిన విషయం ప్రతిపక్షానికి తెలియకపోవడం బాధాకరమన్నారు. "కేంద్ర



ప్రభుత్వం ఆనాడు దేశ వ్యాప్తంగా వెనుకబడిన, హెరిటేజ్ నగరాలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేసింది. మంజూరు చేసిన నిధులను సకాలంలో సద్వినియోగం చేయలేని అసమర్థులు మీరు" అని కాంగ్రెస్ కార్పొరేటర్లు బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు గుప్పించారు. "మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించాం, ప్రజల సమస్యలపై పోరాటం చేశాం. మీడియా అటెన్షన్ కోసం రాజకీయాలు మానుకోండి" అని హితవు పలికారు. ప్రతిపక్షాన్ని సైతం గౌరవిస్తున్న నాయకుడు నాయిని రాజేందర్ రెడ్డి అని, అన్ని డివిజన్‌లలో సమవుజ్జి పాలుగా నిధులను కేటాయిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని వివరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మామిండ్ల రాజు, నెక్కొండ కవిత కిషన్, ఏనుగు మానస రామ్ ప్రసాద్, గుంటి రజిత్ శ్రీనివాస్, నాయకులు కుమార్ యాదవ్, భారత్ కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

# ఐఆర్సీటీసీ దివ్య దక్షిణ యాత్ర

## 'భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్' ద్వారా సురక్షిత ప్రయాణం

**వరంగల్ వాయిస్, వరంగల్:** తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూలై 19 నుంచి జూలై 26 వరకు "భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్" ద్వారా హైదరాబాద్ నుంచి ప్రత్యేక ప్యాకేజీని ప్రారంభిస్తున్నట్లు ఐఆర్సీటీసీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్య దక్షిణయాత్ర జ్యోతిర్లింగంతో (SCZBG45) ఈ యాత్రలో తిరువణ్ణామలై, రామేశ్వరం, మదురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు వంటి పుణ్యక్షేత్రాలు సందర్శన ఉంటాయి. యాత్ర జూలై 19న ప్రారంభమై 26వ తేదీ వరకు కొనసాగుతుంది. టికెట్ ధరలు (ఒక్కొక్కరికి) సాధారణ టికెట్: రూ. 14,100, 3 ఏసీ: రూ. 22,300, 2 ఏసీ: రూ. 29,200లుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్తుంది. రైలు ప్రయాణం, బస్సు సౌకర్యం, హోటల్ వసతి, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్స్, టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శనా స్థలాలు (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, రైల్వే స్టేషన్ నుంచిదేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితంగా ఈ ప్యాకేజీలో ఉంటాయన్నారు. ప్రతి రైలులో 639 మంది ప్రయాణించవచ్చు. ప్రతి 70 మందికి ఇద్దరు కో–ఆర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలను సమకూరుస్తారు. కోచ్‌కు ఒక సెక్యూరిటీ గార్డ్, అలాగే రైలులో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని అధికారులు తెలిపారు. టికెట్ల బుకింగ్, మరింత సమాచారం కోసం టికెట్లు బుక్ చేసుకోవాలనుకునే వారు 9701360701, 9281495845, 9281495843, 9281030749 నంబర్లకు సంప్రదించవచ్చు. మరింత సమాచారం కోసం www.irctctourism.com వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

# కాశిబుగ్గలో వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్ నగరంలోని కొత్తవాడలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు కిరణ్ శర్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

# న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

## ◆ సింగరేణి బాధితుల ఆగ్రహం

**వరంగల్ వాయిస్, గణపురం :** గత 20 సంవత్సరాలుగా పరుశురాంపల్లి గ్రామస్థులు సింగరేణి సంస్థ కార్యకలాపాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతూ, మౌలిక వసతులు, ఆరోగ్య సమస్యలు, భూములు కోల్పోవడం వంటి వాటితో నానా అవస్థలు పడుతున్నారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని బాధితులు స్పష్టం చేస్తున్నారు. "గత 20 ఏళ్లుగా సింగరేణి సంస్థ వల్ల మా గ్రామం మట్టిమయం అవుతోంది. తాగే నీటికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 24 గంటలూ భారీ వాహనాల రాకపోకల వల్ల బయటకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. అనారోగ్యాల పాలై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దాదాపు 99 శాతం భూములు కోల్పోయి ఉపాధి లేక ఆగం అవుతున్నాం" అని గ్రామస్థులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సింగరేణి సంస్థ తమ గ్రామాన్ని తీసుకుంటామని సర్వే చేసి బోర్డులు పాతిందని, అయితే ఆ తర్వాత ఊసే లేదని వారు వాపోతున్నారు. తమ సమస్యల పట్ల స్పందించాలని కోరుతూ గ్రామ మహిళలు, యువకులు మార్చి 10న పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. దీనికి స్పందించిన సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే, తిరిగి ఓసీలో ధర్నా చేయాలని సూచించడంతో గ్రామస్థులంతా కలిసి ఏప్రిల్ 8న మరో సమీక్ష నిర్వహించి ధర్నాకు సిద్ధమయ్యారు. ఏప్రిల్ 9న సింగరేణి సంస్థ, పోలీసు యంత్రాంగం గ్రామస్థులను పిలిచి ధర్నా చేయవద్దని కోరగా, తాము ధర్నా చేస్తామని స్పష్టం చేసి వచ్చేశామని గ్రామస్థులు తెలిపారు. ఏప్రిల్ 10న గ్రామస్థులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. తమపై కేసులు పెట్టిన విషయం



తెలియదని, ఏప్రిల్ 14న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించి సీఎం అండ్ డీ బలరాం నాయక్‌కు తమ సమస్య గురించి ఆదేశాలిచ్చారని చెప్పారు. మే 11న సీఎం అండ్ డీ బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేసినప్పుడు ఆయన కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉడుత నాగరాజు, కనుకుంట్ల సమ్మక్క, ఉడుత సుమత, చెన్నబోయిన కృష్ణ, హనుమాండ్ల రాజు, చెన్నబోయిన రాజులపై కేసులు నమోదైనట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉడుత నాగరాజు మాట్లాడుతూ, "సింగరేణి సంస్థ, స్థానిక ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఎన్ని కుట్రలు చేసి, ఎన్ని అడ్డంకులు వేసినా, ఎన్ని కేసులు పెట్టినా మాకు న్యాయం జరిగి, మా ఊరు పోయి మాకు పునరావాసం కల్పించే వరకు వెనక్కి తగ్గేది లేదు, మా పోరాటం ఆపేది లేదు" అని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని ఆయన పునరుద్ఘాటించారు.

# ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, గణపురం:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో గణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేసు సతీష్ కుమార్ బుధవారం ప్రకటించారు. మధ్యలో బడి మానేసిన వారికి, పదవ తరగతి లేదా ఇంటర్ ఫెయిల్ అయిన వారికి తిరిగి చదువుకునే అవకాశాన్ని కల్పించాలనే లక్ష్యంతో సార్వత్రిక విద్యను ప్రవేశపెట్టినట్లు ఆయన వివరించారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్ అడ్మిషన్లు పొందేందుకు జూలై 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని సతీష్ కుమార్ వెల్లడించారు. ఇందు కోసం రికార్డు షీట్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఇంటర్ అడ్మిషన్ కోసం పదవ తరగతి టీసి, మెమో, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. .ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పొందిన అర్హత పత్రాలు మిగతా అన్ని బోర్డులు అందిస్తున్న అర్హత పత్రాలకు సమానమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

# కేటీపీపీ ఉద్యోగి నిరంజన్ రెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పల్లెర్ల నిరంజన్ రెడ్డికి డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్ –2025 సంవత్సరానికి గాను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (అంతర్జాతీయ యూనివర్సిటీ, యూఎస్ఏ) గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. అనివార్య కారణాల వల్ల జూన్ 28, 2025న చెన్నైలో జరిగిన స్నాతకోత్సవంలో నిరంజన్ రెడ్డి పాల్గొనలేకపోయారు. దీంతో, గురువారం జెన్‌కో కాలనీలో కేటీపీపీ చీఫ్ ఇంజనీర్ చిట్టాప్రగడ శ్రీ ప్రకాష్ చేతుల మీదుగా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి విజయ్ మోహన్, సేవా రత్న జాతీయ అవార్డు గ్రహీత, యూనివర్సిటీ సభ్యుడు బొమ్మకంటి రాజేందర్ ఆధ్వర్యంలో నిరంజన్ రెడ్డికి ఈ హానరరీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ మాట్లాడుతూ, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, అత్యంత ప్రతిభావంతులకు ఈ గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేస్తామని పేర్కొంది. క్యాతపల్లి గ్రామవాస్తవ్యులైన పల్లెర్ల పుల్లారెడ్డి, పూలమ్మ దంపతుల కనిష్ఠ కుమారుడైన పల్లెర్ల నిరంజన్ రెడ్డికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవ డాక్టరేట్ పట్టా లభించడం కేటీపీపీకి గర్వకారణమని అన్నారు. ఆయన అత్యుత్తమ కృషికి, విజయాలకు గుర్తింపుగా ఈ ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్ అవార్డును ప్రదానం చేయడం పట్ల తాము సంతోషిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ రామ ముత్యాల రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు కాటం రవి, మాకుల సంతోష్, జెరిపోతుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు



**వరంగల్ వాయిస్, జనగామ:** సనాతన వైదిక సంస్కృతిలో గురువే నిత్య ఆరాధ్యుడని, పరబ్రహ్మ స్వరూపమని మోహనకృష్ణ భార్గవ అన్నారు. గురువారం ఆషాఢమాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనగామలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ శ్రీ వేద వ్యాస మహర్షి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, ముందుగా ప్రధాన కలశస్థాపన చేశారు. అనంతరం వ్యాసుల వారు, నవబ్రహ్మలు, సప్తర్షులు, గురుపరంపరా ఆచార్యులను ఆవాహన చేసి అష్టోత్తర శతనామాలతో, మహా నీరాజనం, మహా మంత్రపుష్పాలతో ఆరాధన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేదవ్యాస మహర్షిని ఆరాధించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు పాశం శ్రీశైలం, బచ్చు బాలనారాయణ, పట్టణ కోశాధికారి కుందారపు బైరునాథ్, కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, సభ్యులు ఉల్లెంగుల రాజు, అంచూరి రమేష్, కందాడి యాదగిరి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, చంద్రమౌళి, సత్యం, సంపత్ గౌడ్, వివేక్, పోచన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యలకు పరిష్కారం

## జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి



**వరంగల్ వాయిస్, నడికూడ:** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, వారికి ఎల్లప్పుడూ అండగా ఉండే ఏకైక సంఘం పీఆర్టీయూ టీఎస్ మాత్రమే అని హనుమకొండ జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి అన్నారు. గురువారం నడికూడ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఉద్దేశించి శ్రీహరి మాట్లాడుతూ, ఉపాధ్యాయ లోకానికి ఎన్నో సౌకర్యాలు కల్పించిన ఘనత పీఆర్టీయూకు దక్కుతుందన్నారు. అతి త్వరలోనే జీపీఎఫ్ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించే దిశగా సంఘం కృషి చేస్తుందని, మిగతా పెండింగ్ బిల్లులను కూడా సాధ్యమైనంత తొందరగా క్లియర్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు ఇప్పించిన సంవత్సరంలోనే మళ్లీ త్వరలోనే పదోన్నతులు కల్పించే దిశగా పీఆర్టీయూ టీఎస్ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఇంకా ఎన్నో సమస్యలు త్వరలోనే పరిష్కరించే దిశగా సంఘం కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. మండలంలోని కంఠాత్మకూర్, కౌకొండ, నడికూడ, వరికోల్, రాయపర్తి, నార్లాపూర్, చర్లపల్లి, పులిగిల్ల ఉన్నత పాఠశాలల్లో తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు అచ్చ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కట్టుకోజ్వాల సతీష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మోడం రాజేందర్ బాబు, నన్నేసాహెబ్, శ్రీధర్ రెడ్డి, బురుగు శంకర్, జిల్లా బాధ్యులు శరత్ గౌడ్, నగేష్ పాల్గొన్నారు.

# నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదల



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో మే 2025లో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ (లైఫ్ సైన్సెస్), బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్) రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రాంచంద్రం, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్‌ను కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే. ప్రతాప్ రెడ్డి అభినందించారు. అటానమస్ సెమిస్టర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించినందుకుగాను ప్రిన్సిపాల్‌ను వీసీ ప్రశంసించారు. ఫలితాల వివరాలను వెల్లడిస్తూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ, బీఎస్సీలో 41.74శాతం, బీఏలో 51.85శాతం, బీకాంలో 39.02శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కళాశాల మొత్తం మీద 42.62శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఈ ఫలితాలు కళాశాల వెబ్‌సైట్‌లో క్యూఆర్ కోడ్, లింక్ ద్వారా అందుబాటులో ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన కళాశాల విద్య కమిషనర్ ఎ.శ్రీదేవసేన, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాల భాస్కర్‌లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్‌తో పాటు పరీక్షల నియంత్రణ అధికారి ఎస్. కమలాకర్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజీరు, డాక్టర్ భద్రు, స్టాఫ్ సెక్రటరీ రహీముద్దీన్ పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీ భూములను కాపాడుకుందాం

## ● విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ




**వరంగల్ వాయిస్, కేయూ:** అన్యాక్రాంతమవుతున్న కాకతీయ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని, యూనివర్సిటీ భూములకు హద్దులు నిర్మించి ప్రహరీ గోడ కట్టాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. గత నెల 17న యూనివర్సిటీ పాలకమండలి, యూనివర్సిటీ భూములలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఆమోదం తెలిపిన నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భారత్ బచావో రాష్ట్ర నాయకులు, విశ్రాంత అధ్యాపకులు వెంగల్ రెడ్డి, ఓం బ్రహ్మం మాట్లాడుతూ... ఇప్పటికే ప్రభుత్వం వివిధ అవసరాల దృష్ట్యా కొంత భూమిని తీసుకుందని, కబ్జాదారులు మరికొంత భూమిని ఆక్రమించారని గుర్తుచేశారు. ఇప్పుడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కోసం 20 నుండి 30 ఎకరాల వరకు భూములు తీసుకోవడం వలన యూనివర్సిటీ భవిష్యత్తు అవసరాలకు భూముల కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. "యూనివర్సిటీ భూములను ఇతర అవసరాలకు వినియోగించకుండా భవిష్యత్తు యూనివర్సిటీ అవసరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కావున యూనివర్సిటీ అధికారులు ఈ విషయమై దృష్టి సారించి అన్యాక్రాంతమవుతున్న భూముల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి" అని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మద్రి మహేష్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్, బీఎస్‌ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు శివకుమార్, బీఆర్‌ఎస్‌వి యూనివర్సిటీ నాయకులు పస్తం అనిల్ కుమార్ తదితర విద్యార్థి సంఘాల బాధ్యులు మాట్లాడారు. అలాగే, ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, జశ్వంత్ లతో పాటు శేఖర్, సురేష్, నరేష్‌లతో పాటు యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# ఇగ్నోలో దరఖాస్తుల ఆహ్వానం

## పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన డాక్టర్ రాజు



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) జూలై–2025 సెషన్‌కు సంబంధించిన కొత్త ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వివిధ మాస్టర్, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ డిప్లొమా, డిప్లొమా మరియు సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఇగ్నో హైదరాబాద్ రీజనల్ సెంటర్ అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాజు బోళ్ల, లాల్ బహదూర్ కళాశాల ప్రిన్సిపాల్ డా. అరుణా డి.హెచ్. రావు, ఇగ్నో స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ యస్.వి. రమణా రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గురువారం ఇగ్నో టర్మ్ ఎండ్ పరీక్షల నిర్వహణ తీరును డాక్టర్ రాజు పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త ప్రవేశాల కోసం అభ్యర్థులు జూలై 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 98493 81085 నంబర్‌లో సంప్రదించవచ్చు లేదా www.ignou.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

# రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో "యుద్ధం ఎవరి కోసం?" అనే అంశంపై ఈ నెల 13న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ వివిధ పార్టీల నాయకులు గురువారం ఓంకార్ భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సదస్సు నగరంలోని ఎల్బీనగర్‌లో ఉన్న అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సుకు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వినాయక రెడ్డి అధ్యక్షత వహిస్తారు. సదస్సులో టీఎస్‌డీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాసరావు, ఇనాం సంస్థ జాతీయ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జే. చలపతిరావు, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు గుర్రం విజయ్ కుమార్, ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, భారత్ బచావో రాష్ట్ర నాయకులు వెంగల్ రెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, టీఎస్‌డీఎఫ్ రాష్ట్ర నాయకులు నైనాల గోవర్ధన్ లు ప్రసంగిస్తారని తెలిపారు. ప్రపంచ శాంతి కోసం జరుగుతున్న ఈ సదస్సును వివిధ వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు మోడేం మల్లేశం, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, ఇనాం సంస్థ జాతీయ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ అలీ జుబేర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్యతో పాటు భైరబోయిన ఐలయ్య, హరిబాబు, ఖాజా అస్లాం, గంటా శంకర్, సుమన్, వీరన్న, రాజేందర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూ పార్క్–హైదరాబాద్ రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం

## ◆ 15 రోజుల్లో పూర్తి చేయకుంటే దశలవారీ ఉద్యమం



**వరంగల్ వాయిస్, జనగామ :** పట్టణంలోని నెహ్రూ పార్క్ నుండి స్మశాన వాటిక మీదుగా హైదరాబాద్ రోడ్డు వరకు చేపట్టిన 60 అడుగుల రోడ్డు నిర్మాణం గత నాలుగు సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిపోవడంపై సీపీఎం జనగామ జిల్లా కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ల అలసత్వం వల్ల స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారని సీపీఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మండిపడ్డారు.నాలుగు సంవత్సరాల క్రితం మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హడావుడిగా 60 అడుగుల రోడ్డు వేస్తున్నామని చెప్పి, చుట్టుపక్కల ప్రజల ఇళ్లు, పాఠశాలలు, ఫంక్షన్ హాళ్లను కూలగొట్టించారని, రోడ్డు వెడల్పు కోసం తమ స్థలాలను బలవంతంగా గుంజుకున్నారని సీపీఎం నాయకులు గుర్తు చేశారు. ప్రజలు తమ ఇళ్ల స్థలాలను త్యాగం చేసినప్పటికీ, కొంతమంది ప్లాట్లను బలవంతంగా లాక్కొని కేవలం రోడ్డు ఫార్మేషన్ చేసి కంకర డస్ట్ పోసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయించే విషయంలో మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపకపోవడం దారుణమని, వారికి కనీసం మానవత్వం కూడా లేదని విమర్శించారు. గురువారం సీపీఎం నెహ్రూ పార్క్ ఏరియా శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ పార్కు, సెయింట్ ఫాల్స్ స్కూల్ ఏరియా, కురుమవాడ తదితర ప్రాంతాలలో సీపీఎం సమస్యల అధ్యయన సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, వ్యాపార సముదాయాల యజమానులు, పాఠశాల విద్యార్థులు తమ సమస్యలను సర్వే బృందాలకు వెల్లడించి ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే బృందం అక్కడికక్కడే ధర్నా కార్యక్రమం నిర్వహించి, రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసి నిరసన తెలిపారు. స్థానిక సమస్యలపై ఈ నెల 11 శుక్రవారం రోజు మున్సిపల్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో జనగామ పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, నెహ్రూ పార్క్ ఏరియా సీపీఎం శాఖ కార్యదర్శి మంగ బీరయ్య, కర్రె రాములు, శంకర్, కోయల్ కార్ శివాజీ, కే. సత్య రాంజీ, కర్రె బీరయ్య, శివరాత్రి సమ్మయ్య, సుధాకర్, కర్రె మహేందర్, కర్రె సత్యనారాయణ, జన్ను గట్టయ్య, గాజుల నాగరాజు, బంద్రు సత్తయ్య, యాంద్రా మహదేవ్, ఎగ్గే మల్లేష్, కోయల్ కార్ నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

## ◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ:** ఆయిల్ పామ్ సాగు విస్తరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించి, దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉండేలా రైతులను ప్రోత్సహిస్తుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌లో భాగంగా గురువారం లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల గ్రామ రైతు చిట్ల జ్ఞానేందర్ రెడ్డికి చెందిన 12.5 ఎకరాలలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశానికే సరిపడా పామ్ ఆయిల్ ఉత్పత్తి చేసే సామర్థ్యం రైతులకు ఉందని గుర్తించి, ఉద్యాన శాఖ ద్వారా మొక్కలతో పాటు పంట సాగుకు అవసరమయ్యే డ్రిప్ ఇరిగేషన్ సిస్టంను రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సంవత్సరం 3500 ఎకరాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1783 ఎకరాలకు మంజూరు ఇచ్చి మొక్కలను అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ పంట విక్రయించడానికి రైతులు ఇబ్బంది పడకుండా,



జనగామ జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాకు 3 కలెక్షన్ సెంటర్లను మంజూరు చేశామన్నారు. 40 ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలకు నర్సరీ ఏర్పాటు చేస్తున్నామని, అలాగే నూతన ఆయిల్ ఫెడ్ భవనానికి స్థలం కేటాయించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, జిల్లా ఆయిల్ ఫెడ్ మేనేజర్ శంకర్, ఆయిల్ ఫెడ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రైతులు మళ్లీ ఎరువుల కోసం లైన్లోనా?

## బీజేపీ నాయకుడు బాబు యాదవ్



**వరంగల్ వాయిస్, పరకాల:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ రైతాంగం ఎరువుల కొరతను ఎదుర్కొంటుందని, ఇదే దుస్థితి మళ్లీ కనిపిస్తోందని బీజేపీ నాయకులు బాబు యాదవ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న వేళ ఎరువుల కొరత స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. "రైతులు రేషన్ షాపుల ముందు నిలబడినట్లు ఎరువుల డిపోల ముందు లైన్లు కట్టాల్సిన పరిస్థితి మరోసారి తలెత్తుతోంది. ఇప్పటికే జిల్లాల్లో పలు చోట్ల డీఏపీ, యూరియా వంటి ప్రధాన ఎరువులు తగ్గుముఖం పడుతున్నాయి" అని బాబు యాదవ్ తెలిపారు. నిన్న వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో రైతులు నిద్ర కూడా మానేసి రాత్రి నుంచి ఎరువుల కోసం క్యూ కట్టారని గుర్తు చేశారు. ఇదే పరిస్థితి ములుగు, నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లోనూ నెలకొందని ఆయన వెల్లడించారు. "ప్రజాపాలన అని చెప్పే ప్రభుత్వం, ప్రజల శ్వాస అయిన వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే రైతులు ఎలా నమ్మాలి?" అని గ్రామీణ రైతులు ప్రశ్నిస్తున్నారని బాబు యాదవ్ అన్నారు. గతంలోనూ ఇదే కాంగ్రెస్ పాలనలో ఈ విధమైన సమస్యలు తరచూ చోటుచేసుకున్నాయని, మళ్లీ అదే చరిత్ర పునరావృతమవుతుందా అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఎరువులపై రాజకీయాలు కాదని, రైతుకు న్యాయం జరగాలని బాబు యాదవ్ డిమాండ్ చేశారు. "రైతులు మట్టిలో బంగారం పండించేవారు. కానీ ప్రభుత్వం వారికి అవసరమైన ఎరువులు సమయానికి అందించకపోతే, ఆ పంటలు ఎలా పండుతాయని ప్రశ్నించారు. వ్యవసాయాన్ని అర్థం చేసుకునే నాయకత్వం రాష్ట్రానికి ఇప్పుడు అవసరం" అని ఆయన అభిప్రాయపడ్డారు. రైతులకు ఎరువుల వంటి ప్రాథమిక అవసరాలు కూడా తీర్చలేని దుస్థితిలో ఉందని బాబు యాదవ్ విమర్శించారు.

# సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

## రామ రాజేష్ ఖన్నా డిమాండ్



**వరంగల్ వాయిస్, కామారెడ్డి:** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ఉద్యోగులు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఎన్హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని కీలక డిమాండ్లు చేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో గత మూడు సంవత్సరాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఎంఎల్ హెచ్ పీలకు నెలకు రూ.44 వేల వేతనం తోపాటు ఉద్యోగ భద్రతను కల్పించాలని రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కామారెడ్డిలోని ఎస్.ఆర్.వి. కాలేజీలో బి.సందీప్ అధ్యక్షతన జరిగిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ సమావేశానికి రామ రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశం అనంతరం కామారెడ్డి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ముఖ్య సలహాదారులు సుమన్, గౌరవ అధ్యక్షులు రథం (కామారెడ్డి జిల్లా సీపీఐ సెక్రటరీ), జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్స్ తానాజీ, అపర్ణ, జనరల్ సెక్రెటరీ బి.రమ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సందీప్, కోశాధికారిగా సాగర్, కామారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ సచిన్, వినయ్, స్వప్న, రాకేష్, సుష్మలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఎంఎల్ హెచ్ పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాలను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోం

## ◆ కేయూ విద్యా సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ హెచ్చరిక

**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ యూనివర్సిటీలో పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో తీసుకువస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలను అడ్డుకుంటే సహించేది లేదని కాకతీయ యూనివర్సిటీ విద్యా సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ హెచ్చరించింది. గురువారం విద్యార్థి సంఘాల నాయకులు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం పేద విద్యార్థుల భవిష్యత్తును పక్కనపెట్టి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై రాజకీయం చేసి అడ్డుకోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేసి, యూనివర్సిటీ భూములను కబ్జా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే అని వారు గుర్తు చేశారు. ప్రైవేట్ యూనివర్సిటీలు తీసుకువచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని విమర్శించారు. తక్షణమే ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు యూనివర్సిటీ అధికారులు స్థలం కేటాయించి పనులు ప్రారంభించాలని విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ



డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పిడిఎస్‌యూ డి. సారయ్య, వంశీకృష్ణ (టీజీవీపీ), మేడ రంజిత్ కుమార్ (టీటీఎస్ఎఫ్), డా. రాజునాయక్ (టీఎస్ఎఫ్), కన్నం సునీల్ (బీఎస్ఎఫ్), బొట్ల మనోహర్, కడపాక రాజేందర్, సాయికృష్ణ (ఏఐఎస్ఎఫ్), సుమన్ (బీసీ సంఘం), కేతపాక ప్రసాద్ (ఎంవీవీ), ఎం. ప్రదీప్ (ఎస్ఎస్‌బీఎంఎం), జె. రవి (ఎన్ఎస్ఎఫ్), ఎం. రాజు (యూఎస్ఎఫ్ఐ), యూత్ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ అలువల కార్తీక్, రాకేష్, కృష్ణ, లోక్‌నాయక్, సౌరం రాహుల్ వర్ధన్, బి. నాగరాజు (కేయూపీహెచ్‌సీ), కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ తీగల ప్రేమ్‌కుమార్, కాకతీయ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా గురు పౌర్ణమి వేడుకలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆత్మకూరు మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహాన్ని పల్లకిలో ఉంచి, బ్యాండ్ బాజాల మధ్యన పురవీధుల గుండా పల్లకి సేవను నిర్వహించారు. భక్తజన సందోహం మధ్య సాగిన ఈ సేవలో భక్తులు పెద్ద ఎత్తున మంగళహారతులతో తరలివచ్చి బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆత్మకూరు, తిరుమలగిరి, గూడెపాడు గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు బాబా ఆలయానికి తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పవన్ కుమార్ శర్మ భక్తుల చేత ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలే ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అన్నదానంలో పాల్గొని బాబా ప్రసాదంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ కోమల చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు రేవూరి సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బూర సతీష్, ఆలయ కమిటీ సభ్యులు సముద్రాల విజేందర్, కరివేద మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# దామెరలో అక్రమ మద్యం సీజ్

## ఒకరి అరెస్ట్, మద్యం సీజ్



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని ల్యాదెల్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను దామెర పోలీసులు గురువారం వెల్లడించారు. పోలీసు సిబ్బంది ల్యాదెల్ల గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా, బీమారపు రాజయ్య (తండ్రి కనుకయ్య, నివాసం ల్యాదెల్ల) అనే వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్నాడని నమ్మదగిన సమాచారం అందింది. వెంటనే పోలీసులు రాజయ్య ఇంటి ఆవరణలోకి వెళ్లి తనిఖీ చేయగా, అక్కడ రూ. 6,970 విలువైన బీర్, మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, రాజయ్యను, మద్యం సీసాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దామెర ఎస్సై కొంక అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సాయిబాబా మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** గురు పౌర్ణమి పురస్కరించుకుని వరంగల్ నగరంలోని గిర్మాజీపేట, ఫోర్ట్ రోడ్డుల్లో గల షిరిడి సాయిబాబా ఆలయాల్లో వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. గిర్మాజీపేటలోని షిరిడి సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం నుంచే పూజారులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు సాయిబాబా విగ్రహాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి సాయిబాబా దర్శనం చేసుకున్నారు. రాత్రి 10 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం ఆలయంలో మహా అన్న వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పూజారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## మాడ నర్సయ్యకు జర్నలిస్టుల పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ టౌన్:** ఇటీవల ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న సీనియర్ జర్నలిస్టు మాడ నర్సయ్యను పలువురు జర్నలిస్టులు పరామర్శించారు. హనుమకొండ వినాయక నగర్‌లో నివాసం ఉంటున్న మాడ నర్సయ్యను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, జర్నలిస్టు సిద్దోజు రాకేష్ వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సయ్యకు ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## శాయంపేటలో గురు పౌర్ణమి వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలోని శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు అభిషేకాలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహానదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయిబాబా భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందగట్ల రవి, కంబత్తుల ప్రకాష్, భాషని వెంకటేశ్వర్లు, మామిడి రాజు, గన్ను వేణుగోపాల్, మంత్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏవీవీ పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్‌లోని ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 2003 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ పాఠశాల విద్యార్థుల సంక్షేమార్థం రూ. 50,166 విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని ఏవీవీ విద్యా సంస్థల శాశ్వత సభ్యులుచందా శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చందా శ్రీకాంత్ మాట్లాడుతూ, తన తాతగారైన ఆచార్య చందా కాంతయ్య స్థాపించిన ఈ విద్యా సంస్థలో 2003లో పదవ తరగతి పూర్తి చేసుకుని నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలిచి, తాము విద్యనభ్యసించిన ఈ సంస్థకు విరాళాన్ని అందజేసినందుకు పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ విరాళాన్ని పాఠశాల అభివృద్ధికి ఉపయోగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా. భుజేందర్ రెడ్డి, పూర్వ ప్రధానోపాధ్యాయులు, ప్రస్తుత విద్యా సలహాదారులు వాసుదేవులు, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు, 2003 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలకు ఆసరా పింఛన్లు ఇవ్వాలి

### తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం డిమాండ్



**వరంగల్ వాయిస్, శాయంపేట:** తెలంగాణలో 50 సంవత్సరాలు నిండిన అర్హులైన పద్మశాలీలందరికీ జియో ట్యాగ్‌తో సంబంధం లేకుండా ఆసరా పింఛన్లు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం శాయంపేట మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య డిమాండ్ చేశారు. శాయంపేట మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 1500 మంది పద్మశాలీలు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ పరంపర నేటికీ కొనసాగుతోందని సాంబయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు సరిపడా పని లేకపోవడం, పని భద్రత లేని కారణంగానే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ నెలకు ఐదు వేల రూపాయల ఆసరా ఇవ్వాలని ఆయన కోరారు. చేనేత కార్మికులు చనిపోతే వారి స్థానంలో వారి భార్యలకు ఆసరా పింఛన్ ఇవ్వాల్సి ఉండగా, గత ప్రభుత్వము ఇవ్వలేదని, నేటి ప్రభుత్వం కూడా అదే బాటలో కొనసాగుతోందని సాంబయ్య ఆరోపించారు. మరణించి పెండింగ్‌లో ఉన్న చేనేత కార్మికుల స్థానంలో వారి భార్యలకు ఆసరా పింఛను వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం శాయంపేట మండల ప్రధాన కార్యదర్శి సామల ధనుంజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్, జిల్లా నాయకుడు బాసని బాలకృష్ణ, పద్మశాలి మండల మహిళా అధ్యక్షురాలు బాసని శాంత, మండల నాయకులు చిందం రవి, భాషని మల్లికార్జున్, దిడ్డి ప్రభాకర్, ముదిగొండ సంతోష్, మోత్కూరి సత్యనారాయణ, కొండ ముకుందం, వనం దేవరాజు, కోమటి శేఖర్, దాసరి రవి, రంగు మహేందర్, గొట్టిముక్కుల రాజు పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ అవినీతిపై టీసీఏ ఆగ్రహం

### బాధ్యతలు టీసీఏకు అప్పగించాలని డిమాండ్



**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణ రాష్ట్ర క్రికెట్ అభివృద్ధి పేరుతో వందల కోట్ల బీసీసీఐ నిధులను దుర్వినియోగం చేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్ రావు అవినీతి కేసులో అరెస్ట్ అవ్వడంపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) తీవ్రంగా స్పందించింది. దీనిపై పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపి దోషులకు తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేసింది. ఇప్పుడు తెలంగాణ క్రికెట్‌ను సరైన దిశగా తీసుకువెళ్లే బాధ్యతను తమకు (టీసీఏకు) అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం, బీసీసీఐలను టీసీఏ రాష్ట్ర కోశాధికారి డా. పెసరు విజయచందర్ రెడ్డి కోరారు. "ఇన్నేళ్లుగా అవినీతి పాలకుల చేతుల్లో తెలంగాణ క్రికెట్ నాశనమవుతోంది. మళ్లీ అదే పరిస్థితి పునరావృతం కాకూడదంటే, అది ప్రజల నుంచి వచ్చిన సంస్థ చేతిలో ఉండాలి. అదే టీసీఏ," అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి కృషి చేసిన ఏకైక సంస్థగా టీసీఏ నిలిచిందని విజయచందర్ రెడ్డి పేర్కొన్నారు. గత 15 సంవత్సరాలుగా నిరంతర సేవలతో రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్‌లో మార్పు తీసుకురావడంలో టీసీఏ పాత్ర అమోఘమని ప్రశంసించారు. ఇప్పటి వరకు 12 వేల మందికి పైగా క్రికెటర్లను అన్ని ఫార్మాట్లలో సిద్ధం చేయడమే కాకుండా, మహిళల క్రికెట్‌కు ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా కూడా టీసీఏ ఆదర్శంగా నిలిచిందని ఆయన తెలిపారు. జిల్లాల్లోని స్కూల్ స్థాయి నుంచి శిక్షణ ఇవ్వడం ద్వారా యువతకు ప్రొఫెషనల్ స్థాయికి చేరే మార్గాన్ని టీసీఏ అందిస్తోందన్నారు. ప్రతి జిల్లాలో పిల్లల క్రికెట్ కెరీర్ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తున్నామని, ఇప్పటికే శిక్షకుల తయారీకి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని డా. పెసరు విజయచందర్ రెడ్డి వివరించారు.

## కేసీఆర్ కట్టుబానిసలు మీరు

### మాజీ మంత్రిపై కాంగ్రెస్ నేత ఫైర్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** మానుకోట అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మురళీ నాయక్‌పై మరోసారి నోరుజారితే ఖబడ్దార్ అని, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ వ్యాఖ్యలు మహిళా లోకానికే సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు మండిపడ్డారు. ఆమె పదేళ్ల పాటు విధ్వంసకర పాలన చేశారని ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన, మాజీ గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మీద చేసిన విమర్శలను తిప్పికొట్టారు. ఈ సందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ, పదేళ్ల పాటు తెలంగాణలో విధ్వంసపు పాలన చేసిన మీరు ఎమ్మెల్యే మురళీ నాయక్‌పై అవాకులు చెవాకులు పేలడం సిగ్గుచేటన్నారు. "మంత్రిగా ఉన్న సమయంలో ఈ జిల్లాకు మీరు చేసిందేమిటో చెప్పాలి" అని ఆయన సత్యవతి రాథోడ్‌ను ప్రశ్నించారు. మురళీ నాయక్ అంటే ఓ నిశ్శబ్ద విప్లవమని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మానుకోటకు 400 కోట్ల నిధులు తెచ్చిన ఘనత తమ ఎమ్మెల్యేకు దక్కిందని శంతన్ రామరాజు అన్నారు. కేసీఆర్ కుటుంబానికి కట్టప్పలా, కట్టు బానిసలా ఊడిగం చేసిన మీకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతికత లేదన్నారు. "స్థాయిని మరిచి మీ కేటీఆర్ చేస్తున్న సవాలుకు మేము సరిపోతాం. దమ్ముంటే మానుకోటకు ఇచ్చిన ఉత్తుత్తి జీవోలపై చర్చకు రండి" అని ఆయన సవాల్ విసిరారు. చర్చ కోసం ఓ కుర్చీని కూడా ఖాళీగా ఉంచామని తెలిపారు. నాయకులు సత్యమనోరమ, కమ్మగాని కృష్ణమూర్తి, నారాయణ్ సింగ్, సిరిపురం వీరన్న, గుగులోత్ రాములు నాయక్, భానోత్ హరిసింగ్ నాయక్, లకావత్ పద్మ, గంద్రాతి మల్లేష్, భూక్య లక్ష్మి, మాధవి, రాము పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### ◆ జిల్లా కలెక్టర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్:** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొక్క దయాసాగర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులు వృత్తిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చాలా మంది జర్నలిస్టులు దాదాపు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి ఈ వృత్తిని కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాలు, వివిధ అభివృద్ధి పనులను కథనాల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తూ జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారని గుర్తుచేశారు. ఈ క్రమంలో తమ సమస్యలు, హక్కులను ప్రభుత్వ దృష్టికి, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాలని కోరారు. వరంగల్‌లోని దేశాయిపేటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయించాలి. వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులను అందజేయాలి. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి. ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యా అవకాశాలను కల్పించాలి. జర్నలిస్టులపై దాడుల నియంత్రణకై జిల్లా స్థాయి కమిటీని నియమించాలి. జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. వరంగల్ గ్రేటర్ మున్సిపాలిటీ కార్పొరేషన్ / మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశాల్లో జర్నలిస్టులను అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, జిల్లా అధ్యక్షులు పొడేటి అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చిక వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల సురేందర్, బోనాల సాంబయ్య, జిల్లా కోశాధికారి గాయపు రాజు రెడ్డి, జాయింట్ సెక్రటరీ గుగులోతు కిషన్, జిల్లా కమిటీ సభ్యులు సదిరం కుమార్, జీనుకల రజినీ కుమార్, ఎండీ. అక్మల్ పాషా పాల్గొన్నారు.



గడ్డం కేశవమూర్తి



# పోరాట యోధుడు.. ఇనుగాల శ్రీధర్

- కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం
- చిరస్మరణీయ విజయాలకు కేరాఫ్ అడ్రస్
- కార్మికోద్యమంలో చెరగని ముద్ర
- తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర



రాజకీయ వారసత్వం ఆయనకు లేదు. కోట్లాది రూపాయల స్థిర, చర ఆస్తులు లేవు. అయితే నేం... క్రమశిక్షణ, దూరదృష్టి ఆయనలో ఉంది. వ్యూహ చాతుర్యం ఉంది. పోరాడే శక్తి ఉంది. అన్నింటికి మించి నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల కష్టసుఖాలు తెలిసిన ఆయనే.. కార్మికోద్యమ నేత.. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (327 ఐఎన్ టీయూసీ) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్. గత మూడు దశాబ్దాలుగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల హక్కుల సాధన కోసం అవిశ్రాంత పోరాటం చేస్తున్న ఆయన ఒక నిప్పు కనిక. తెలంగాణలో ప్రధాన యూనియన్ లీడర్ గా అడ్డంకులు అధిగమించి అనేక చిరస్మరణీయ విజయాలు సాధించారు. విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళుతున్న ఆయన కార్మికోద్యమంలో చెరుగని ముద్ర వేసుకున్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగిన ఆయన ఐఎన్ టీయూసీలో కీలకపాత్ర పోషిస్తూ జాతీయ నేతగా మన్ననలు పొందారు.

## బాల్యం.. నేపథ్యం

ఇనుగాల శ్రీధర్ 1967 డిసెంబర్ 8న నాటి ఉమ్మడి వరంగల్, నేటి ములుగు జిల్లా కాసిందేవి పేటలో జన్మించారు. తల్లిదండ్రులు ఇనుగాల సరస్వతి–జనార్ధన్. వీరిది మధ్యతరగతి కుటుంబం. ఆయనకు తమ్ముడు శ్రీనాథ్, చెల్లెలు మాలతి ఉన్నారు. వీరి తండ్రి గ్రామంలో పోస్ట్మాస్టర్ గా, కారోబార్ గా, బిల్ కలెక్టర్ గా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. 1995 ఫిబ్రవరి 5న హనుమకొండ వడ్డేపల్లికి చెందిన సత్యవాణిని శ్రీధర్ వివాహం చేసుకున్నారు. పెద్ద కుమారుడు శశాంత్, కోడలు ప్రియాంక, చిన్న కుమారుడు కౌశిక్, మనుమరాలు వర్ణిక ఉన్నారు. ఇద్దరు కుమారులు సాఫ్ట్ వేర్ రంగంలో ఇంజినీర్లుగా పనిచేస్తూ జీవితంలో స్థిరపడ్డారు.

## విద్యాభ్యాసం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ చోట్ల శ్రీధర్ విద్యాభ్యాసం కొనసాగింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు స్వగ్రామం కాసిం దేవి పేటలో చదివారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు దేవగిరి పట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యసించారు. 1985లో ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, వరంగల్ లారెల్ ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్స్ చేశారు. ఆ తర్వాత హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (బీజెడ్సీ) పూర్తి చేశారు. విద్యార్థి దశలో శ్రీధర్ ఎన్ఎస్ యూఐలో క్రియాశీలకంగా పని చేశారు. నాయకత్వ లక్షణాలు ఆయనకు అప్పుడే అలవడ్డాయి.

## ఉద్యోగ ప్రస్థానం..

ఐటీఐతోపాటు డిగ్రీ పూర్తి కాగానే 1993 నవంబర్ 25న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ (ఏపీఎస్ఈబీ)లో హెల్పర్ గా ఉద్యోగంలో చేరారు. మొదట కేసముద్రంలో పని చేశారు. 1994 డిసెంబర్ లో జూనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది 1998 జులై వరకు డోర్నకల్, కేసముద్రం మండలాల్లో బిల్ కలెక్టర్ గా సేవలందించారు. అనంతరం బదిలీపై వరంగల్ డివిజన్ కు వచ్చి సుదీర్ఘకాలం ఇక్కడ సేవలందించారు. 2004లో యూడీసీగా పదోన్నతి పొంది హనుమకొండ ఈఆర్ఓ,సెంట్రల్ ఆఫీస్, కాజీపేటలతో పాటు వరంగల్ సబ్ డివిజన్ లో ఎనిమిది సంవత్సరాలు పనిచేశారు. 2012లో జనగామలో పనిచేస్తుండగా జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పదోన్నతి లభించింది. వరంగల్ మహానగరంలో వివిధ చోట్ల పనిచేసిన ఆయనకు 2024లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పదోన్నతి లభించినప్పటికి ఆయన అందులో చేరలేదు. ప్రస్తుతం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ లో జేఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇనుగాల శ్రీధర్ చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం శ్రమ శక్తి అవార్డు అందజేసింది.

## 327 సంఘ సేవలో...

కార్మిక పక్షపాతిగా పేరు గడించిన ఇనుగాల శ్రీధర్ ఉద్యోగంలో చేరిన నాటి నుంచే విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు బంధువుగా నిలిచారు. వివిధ స్థాయిల్లో పనిచేసిన ఆయన జాతీయ నేతగా గుర్తింపు పొందారు. 1994లో విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ –327 మహబూబాబాద్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ గా యూనియన్ లో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1999 లో వరంగల్ డివిజన్ ప్రెసిడెంట్ గా నియామకమై కార్మికుల హక్కుల కోసం కదం తొక్కారు. 2002లో రీజినల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టి న శ్రీధర్ సుదీర్ఘకాలం అలుపెరుగని పోరాటం చేశారు. 2008లో ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీగా నియామకమై ఆరేళ్ల పాటు సమర్థవంతంగా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్ లో కూడా చాలా కాలం జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం 2014 జులై 2 నుంచి రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ జనరల్ గా బాధ్యతలు చేపట్టిన ఆయన పుష్కరకాలంగా సేవలు అందిస్తున్నారు. 2006లో ఐఎన్టీయూసీలో ప్రత్యేక ఆహ్వానితునిగా నియామకమయ్యారు. 2010లో ఆల్ ఇండియా ఐఎన్టీయూసీ వర్కింగ్ కమిటీ మెంబర్ గా, 2014లో ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. 2018లో ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. అలాగే 2006లో ఐఎన్ఈడబ్ల్యూఎఫ్, వైస్ ప్రెసిడెంట్ గా పని చేశారు. ఎన్పీడీసీఎల్ పెన్షన్ ట్రస్టులో అడ్వైజరీ బోర్డు మెంబర్ తో పాటు 2014 నుంచి తెలంగాణ స్టేట్ ఈఆర్ సీలో మెంబర్ గా కొనసాగుతున్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ పక్షాన "యెమెన్' దేశ పర్యటన చేసి కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేశారు. యాదాద్రి పుణ్యక్షేత్రంలో యూనియన్ భవన నిర్మాణం కోసం 550 చదరపు గజాలు, సంగారెడ్డిలో 220 చదరపు గజాల స్థలాన్ని సాధించారు. హనుమకొండ వడ్డేపల్లి ప్రధాన రహదారిలో స్వర్గీయ పల్లా రవీందర్ రెడ్డి స్మారకార్థం భవనాన్ని నిర్మించడంతో పాటు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఐఎన్ టీయూసీ జాతీయ అధ్యక్షుడు గొంగళ్ల సంజీవరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో పనిచేస్తున్న శ్రీధర్ యూనియన్ పటిష్టతకు నిర్విరామ కృషి చేస్తున్నారు. రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు.

## నికార్సైన కార్మిక నేత..

గత మూడు దశాబ్దాలుగా ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఇనుగాల శ్రీధర్ నికార్సైన కార్మిక నేత. ఆయన హయాంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు చాలా విధాల మేలు జరిగింది. 1993 బ్యాచ్ కు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇప్పించారు . రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014, 2018లో రెండుసార్లు ఫిట్ మెంట్ తో పాటు వెయిటేజ్ ఇంక్రిమెంట్లతో వేతన సవరణలు చేయించారు. అలాగే 2022 వేతన సవరణలో సింగిల్ మాస్టర్ స్కేల్ సాధించారు. 2017 నవంబర్ మాసంలో కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ వరంగల్ మహానగరంలో నల్ల చొక్కాలతో ర్యాలీ, భారీ బహిరంగ సభను నిర్వహించారు. దీని వల్ల 23,623 మంది కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరిగింది. ప్రమాద బారిన పడిన విద్యుత్ సంస్థ ఉద్యోగులు, కార్మికులకు కృత్రిమ అవయవాలను అందించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు గుర్తింపు కార్డులతో పాటు ,సంస్థ ఉద్యోగులకు అన్ లిమిటెడ్ క్రెడిట్ కార్డ్స్ ఇప్పించారు. విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి రూపాయల బీమా సౌకర్యం, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించారు. అన్ మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ కార్మికుల ప్రమాద బీమా రూ.20 లక్షలు సాధించడంలో ఆయన కృషి ఎంతో ఉన్నది. ప్రతి ఏటా యూనియన్ ఆవిర్భావ దినోత్సవం, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తు ఉద్యోగుల్లో ఐక్యత సాధించారు. విద్యుత్ ఉద్యోగుల పదవి విరమణ తర్వాత ఆర్థిక ప్రయోజనాలకు ఇబ్బంది కలగకుండా పీ అండ్ జీ ట్రస్టులను ఏర్పాటు చేయించారు.















## తెలంగాణ ఉద్యమంలో...

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఇనుగాల శ్రీధర్ చురుగ్గా పాల్గొన్నారు. 2001 నుంచి 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ధర్నాలు, రాస్తారోకోలు, రైలు రోకో, సాగర సమాహారం, సకల జనుల సమ్మె, సహాయ నిరాకరణ, విధుల బహిష్కరణ తదితర ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని తన వంతు పాత్ర పోషించారు. "జాక్ " ఏ పిలుపు నిచ్చినా దాని కో చైర్మన్ గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్యుత్ సంస్థ ఉద్యోగుల ఒకరోజు వేతనాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలో చనిపోయిన 25 మంది అమర కుటుంబాలకు 25 వేల చొప్పున ఆయన అందించారు. ముఖ్యంగా విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ముఖ్య నేతగా తెలంగాణ ఉద్యమకారుల్లో స్ఫూర్తినింపారు.




# మున్నూరుకాపు సంఘం బలోపేతానికి కృషి

◆ **వరంగల్ జిల్లా అధ్యక్షుడు ముష్కమల్ల సుధాకర్**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ జిల్లా మున్నూరుకాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ముష్కమల్ల సుధాకర్ పటేల్ అన్నారు. గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతానికి వరంగల్ జిల్లాలోని అన్ని మండలాల్లో మున్నూరుకాపు సంఘం కమిటీలను ఏర్పాటు చేసి అందరినీ ఏకతాటిపైకి తీసుకొస్తానన్నారు. మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ సుమారు 11 సంవత్సరాల తర్వాత వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ముష్కమల్ల సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తనను ఎన్నుకున్నందుకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ పటేల్, మంత్రి కొండా సురేఖలకు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కొండా మురళీ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు. వరంగల్‌లో కమ్యూనిటీ హాల్‌కు ఎకరం స్థలం ఇచ్చి కట్టించడానికి కృషి చేస్తానన్నారు. త్వరలో మంత్రి సురేఖను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, రాష్ట్ర కార్యదర్శి బండి రమేశ్, వలిశెట్టి సుధాకర్, కంచి మనోహర్, బొరిగం భాస్కర్, దొరం ఆనంద్, వానం శ్యామ్, ముష్కమల్ల దేవేందర్, చెర్కులపల్లి సతీష్, గొట్టే వెంకన్న, తోట తిరుమల్, కోల కృష్ణ, గోపు రఘుపతి, మున్నూరు కాపు కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.



# చెత్తతో నిరసన

◆ **గాంధీ సెంటర్ లో రోడ్డుపై బైఠాయింపు**

గత 20 రోజులుగా చెత్త సేకరణ జరగడం లేదంటూ డోర్నకల్ ప్రాంతానికి చెందిన లవన్ కుందోజు గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తన ఇంట్లో పేరుకుపోయిన చెత్తతో డోర్నకల్ మెయిన్ రోడ్ గాంధీ సెంటర్ లో బైఠాయించి గంటపైగా నిరసన తెలియజేశారు. డోర్నకల్ లో 10 చెత్త సేకరణ వాహనాలు ఉండాల్సినప్పటికీ ఒకటి మాత్రమే పనిచేస్తోందని ఆరోపించారు. దీంతో శానిటేషన్ ఇన్ స్పెక్టర్ సురేష్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ స్పందించారు. వెంటనే మున్సిపల్ కార్యాలయనికి వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ సమస్యపై అరాతీసి త్వరలోనే పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారు.

-వరంగల్ వాయిస్, డోర్నకల్

# బాబా గుడిలో భక్తజనం

◆ గురు పౌర్ణమి సందర్భంగా పోటెత్తిన భక్తులు
◆ శేజ హారతితో ముగిసిన పూజా కార్యక్రమాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మనం జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగటానికి మనకు తోడు, నీడై నిలిచి మనల్ని సన్మార్గంలో నడిపించే గురువులను పూజించి వారిని గౌరవించుకునే రోజే 'గురు పౌర్ణమి' అని హనుమకొండలోని సాయిబాబా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ అన్నారు. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మందిరంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పూజారులు కిషోర్ శర్మ, మణిశర్మ, చందులు మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. సివిల్స్ లో 11వ ర్యాంకు సాధించిన సాయి శివాని తల్లిదండ్రులతో కలిసి బాబా దర్శనం చేసుకున్నారు. ఆమెకు మందిర చైర్మన్ శేష వస్త్రాలలు అందజేసి ఘనంగా సత్కరించారు. నగర ట్రాఫిక్ ఏసీపీ తీర్థాల సత్యనారాయణ, సుబేదారి సర్కిల్ ఇన్ స్పెక్టర్ రంజిత్ కుమార్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముఖ్య దాతలుగా తుంగతుర్తి శేషగిరిరావు–వరలక్ష్మి దంపతులు వ్యవహరించారు. మందిరంలో భక్తులకు మహా అన్నదాన ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం జరిగిన పల్లకి సేవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథునికి జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమాలను మందిర ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందం, వెయ్యిగండ్ల రమేష్, పూస సురేష్ కుమార్ లు పర్యవేక్షించారు. రాత్రి 9.30 గంటలకు నిర్వహించిన శేజ హారతితో కార్యక్రమాలు ముగిశాయి.




## గిర్మాజీపేటలో గురు పౌర్ణమి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 27వ డివిజన్ గిర్మాజిపేటలో గురువారం జిట్టేడు హనుమాన్ దేవాలయంలో గురుపౌర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు తోట సంపత్ కుమార్, మిట్టపల్లి సంజయ్ తదితరులు జిట్టేడు హనుమాన్ దేవాలయంలోని సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గర్నేపల్లి సుధాకర్, మురళి, హరి, వెంకటేశ్వర్లు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యతతో అభివృద్ధి సాధించాలి

◆ **పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య**
◆ **ఆరె కటిక గురువు శ్రీ ధర్మ వ్యాదుడి విగ్రహావిష్కరణ**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆరెకటికలు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి సాధించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. 11వ డివిజన్ అలంకార్ జంక్షన్ లో ఆరె కటిక గురువు శ్రీ ధర్మ వ్యాదుడి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కావ్య మాట్లాడుతూ.. ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చన్నారు. ఆరెకటికలు ఐకమత్యంగా ఉండి వారి సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నదని గుర్తు చేశారు. ఆరె సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి–సురేందర్, మాజీ కార్పొరేటర్ మిరియాల్కర్ దేవేందర్, విష్ణువర్ధన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరెకటిక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి రూ.2.45 కోట్లు

◆ **మంత్రి సురేఖకు కమిటీ కృతజ్ఞతలు**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రంగసాయిపేట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానమునకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ రూ.2.45 కోట్లు సీజీఎస్ ఫండ్ ద్వారా నిధులను మంజూరు చేసినందున ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకట రామ నరసింహ శాస్త్రి, ధర్మకర్తలు ఆవులూరి కుమార్, విలాసాగరం శ్రీను, సోమ అనిల్, బొల్లెపల్లి సరిత శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు, ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత చైర్మన్ వెంకటరామ నరసింహ శాస్త్రి వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగసాయిపేటలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి భద్రాచలం తర్వాత రెండో భద్రాదిగా పేరుందన్నారు. మెరుగైన సదుపాయాలతో కమిటీ హాల్ రూపుదిద్దుకోబోతోందన్నారు. దేవస్థానంలో జరుగే ప్రతి కార్యక్రమాన్ని అందరి సహకారంతో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుండు చందన పూర్ణ చందర్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఏలుగు సాంభేశం, దామర కొండ కరుణాకర్, అనిల్, రమేష్ కుమార్, కిరణ్, కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తలు పద్మావతి, హేమలత, స్వరూప, రమ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com